
సాక్షి గుంటూరు

శుక్రవారం । 27 । జూన్ । 2025



ప్రత్యేక పూజలు

నాదెండ్ల: గణపవరంలో కొలువైయున్న కోదండ రామస్వామి ఆలయంలో గురువారం ఏపీ పంచాయతీరాజ్ చీఫ్ ఇంజినీర్ జి.బ్రహ్మయ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురి సౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 514.30 అడుగుల వద్ద ఉంది. ఇది 139.0872 టీఎంసీలకు సమానం.

వారాహి అలంకరణలో బగళాముఖి



చందోలు (కర్లపాలెం): వారాహి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా చందోలు గ్రామంలోని బగళాముఖి అమ్మవారికి గురువారం వారాహి అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. పూలు, పండ్లు సమర్పించిన భక్తులు పసుపు, కుంకుమలతో పూజలు చేశారు.

న్యూస్‌రీల్

శ్రీవారిని దర్శించుకున్న హంపి పీఠాధిపతి



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవాలయంలో బృందావన శ్రీనివాసుడిని గురువారం హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతీ మహాస్వామి దర్శించుకున్నారు. ఆలయ పాలక మండలి సభ్యులను, భక్తులను ఆయన ఆశీర్వదించారు. కార్యక్రమంలో బొల్లేపల్లి సత్యనారాయణ, ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, కార్యదర్శి బొర్రా ఉమా మహేశ్వరరావు, సహాయ కార్యదర్శులు ఊటుకూరి నాగేశ్వరరావు, పుట్టా ప్రభాకర రావు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టర్ సాదియాకు బంగారు పతకం




మంగళగిరి: ఈ నెల 22వ తేదీ నుంచి కర్ణాటకలో జరుగుతున్న జూనియర్ నేషనల్ ఎక్విప్డ్ ఉమెన్ పవర్ లిఫ్టింగ్ పోటీలలో గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన సాదియా అల్మాస్ బంగారు పతకం కైవసం చేసుకున్నారు. ఈ మేరకు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కొమ్మాకుల విజయ భాస్కరరావు, షేక్ సంధానిలు గురువారం తెలిపారు. 57 కేజీల స్క్వాడ్ విభాగంలో 200.5 కేజీలు, డెడ్ లిఫ్ట్‌లో 185.5 కేజీల బరువులు ఎత్తి ఆల్మాస్ రికార్డు సృష్టించారని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆల్మాస్‌ను పలువురు అసోసియేషన్ ప్రతినిధులు అభినందించినట్లు వెల్లడించారు.

మొహరం వేడుకలు ప్రారంభం




పొన్నూరు: మొహరం పండుగ వేడుకలు గురువారం ప్రారంభమయ్యాయి. హజరత్ మొహమ్మద్ వారి మనుమలు హజరత్ ఇమామే హసన్, హజరత్ ఇమామే హుస్సేన్ త్యాగాలను స్మరిస్తూ పట్టణంలోని మొల్లా దహెరా మసీదు వద్ద పీర్ల చావిడిలో పీర్లను పూలతో అలంకరించారు. మేళతాళ వాయిద్యాలతో జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో మొల్లా హైదర్, మొల్లా గబ్బర్ బాషా, మొల్లా సంధాని, మొల్లా నజీర్, మొల్లా ఖలీల్ బాషా, మొల్లా జలీల్, మొల్లా బాజి, మొల్లా నసీర్, మొల్లా రహంతుల్లా, షేక్ గౌస్, మొల్లా అసద్, మొల్లా అర్షద్, మొల్లా ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు. మొల్లా కరీమ్ పర్యవేక్షించారు. జూలై 4వ తేదీ వరకు వేడుకలు కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

డీడీఏగా నాగేశ్వరరావు బాధ్యతల స్వీకరణ



కొరిటెపాడు (గుంటూరు): గుంటూరు జిల్లా వ్యవసాయ శాఖ ఉప సంచాలకులు (డీడీఏ)గా ఎ.నాగేశ్వరరావు గురువారం జిల్లా కలెక్టరేట్ ఆవరణలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. నాగేశ్వరరావు వైఎస్సార్ కడప జిల్లాలో డీడీఏగా పనిచేస్తూ బదిలీపై గుంటూరు వచ్చారు. ప్రస్తుతం గుంటూరు జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు(జేడీఏ)గా పనిచేస్తున్న యు.నరసింహారావు ఈ నెల 30వ తేదీన పదవీ విరమణ చేయనున్నారు. నరసింహారావు రిటైర్ అయ్యాక ఎ.నాగేశ్వరరావు ఆయన స్థానంలో కొనసాగనున్నారు.

సత్య సాయిబాబా ప్రచార రథానికి స్వాగతం



తెనాలి: పుట్టపర్తిలోని శ్రీ సత్య సాయిబాబా ఆశ్రమ ప్రస్థానం 75 ఏళ్లకు చేరుకుంటున్న సందర్భంగా ప్రత్యేక ప్రచార రథం రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తోంది. శ్రీసత్య సాయిబాబా బోధనలను ప్రచారం చేస్తోంది. ఆ క్రమంలో బుధవారం రాత్రి తెనాలి వచ్చిన ప్రచార రథానికి ఘన స్వాగతం లభించింది. భక్తులు పలువురు హారతులిచ్చి, ప్రత్యేక పూజలు చేశారు. విశ్రాంత పోలీసు అధికారి విఠలేశ్వర్, కుమార్ పంప్స్ ఎండీ కొత్త సుబ్రహ్మణ్యం, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

‘పసుపు’ పచ్చగా సాగుతూ...

జిల్లాలో పసుపు పంటకు రైతులు సమాయత్తం



పసుపు కొమ్ములు ఏరుతున్న మహిళలు (ఫైల్)

- ఆశావహ పరిస్థితులతో భారీగా మొగ్గు
- తూములూరుకు చేరిన కడప విత్తనం
- 270 లారీల్లో తీసుకొచ్చిన వ్యాపారులు
- ఇప్పటికే ఆరంభమైన విక్రయాలు
- క్వింటా రూ.2,500 చొప్పున అమ్మకం
- ఎండు పసుపు ధర క్వింటా రూ.9,500

ప్రస్తుత ఖరీఫ్ సీజనులో పసుపు సాగుకు మెట్ట రైతులు సమాయత్తం అయ్యారు. తొలకరి వర్షంతోనే కడప నుంచి విత్తన పసుపు వచ్చేసింది. కొల్లిపర మండల గ్రామం తూములూరు కేంద్రంగా అమ్మకాలు ప్రారంభం అయ్యాయి. మార్కెట్లో ఎండు పసుపు క్వింటా సగటున రూ.9,500 ఉంది. విత్తన పసుపు క్వింటా రూ.2,500–3,000 మధ్య విక్రయిస్తున్నారు. సాగుకు చేలో సాళ్లు చేయటం, దుంప విత్తటం వంటి పనులను రైతులు ఆరంభించారు.

తెనాలి: ఈ ఏడాది పసుపు సాగు పెరిగినా... ఏటా ప్రకృతి వైపరీత్యాలు, తగ్గిపోతున్న దిగుబడులు, మార్కెట్ ధరల మాయాజాలం వంటి ప్రతికూలతలు రైతులను వెన్నాడుతూనే వచ్చాయి. 2024 – 25 ఖరీఫ్ సీజనులో ఎకరాకు 5–10 క్వింటాళ్ల మేరకు దిగుబడి తగ్గిన విషయం తెలిసిందే. మరో వైపు మార్కెట్ ధరలు రైతులకు నిరాశ కలిగిస్తున్నాయి. 2022–23 సీజనులో క్వింటా రూ.5 వేలకు అటూఇటుగా ఉన్న ధర తర్వాత సీజనులో ఒక్కసారిగా అనూహ్యంగా పెరిగింది. 2023–24 సీజనులో పెరుగుతూ రూ.14,800 వరకు కొనుగోళ్లు జరిగాయి. మళ్లీ సీజనుకు పసుపు చేతికొచ్చే సరికి క్వింటా రూ.12 వేలుగా ఉన్న మార్కెట్ ధర తగ్గిపోతూ రూ.10 వేలకు అటూఇటుగా నడిచింది.

దాదాపు 3 వేల ఎకరాలకుపైగానే..

ప్రస్తుతం సగటున క్వింటా రూ.9,500 ధర పలుకుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో రైతులు పసుపు సాగు కొనసాగిస్తున్నారు. జిల్లాలో 2024–25 ఖరీఫ్ సీజనుకు 3,158 ఎకరాల్లో సాగు చేశారు. గతంలో మంచి ధర రావటంతో ఖరీఫ్ సీజనులో పసుపు సాగు విస్తీర్ణం కొంత పెరిగింది. జిల్లాలో అత్యధికంగా కొల్లిపర మండలంలో 1,635 ఎకరాల్లో వేశారు. ఇప్పుడు కూడా విస్తీర్ణం 3 వేల ఎకరాలకు పైగానే ఉంటుందని అంచనా వేస్తున్నారు.

విత్తన పసుపు విక్రయం



డెల్టా ప్రాంతంలో సాగుకు అవసరమైన సేలం రకం విత్తనం పసుపు ఏటా వైఎస్సార్ కడప జిల్లా నుంచి వస్తున్న విషయం తెలిసిందే. నియోజకవర్గంలోని కొల్లిపర మండల గ్రామం తూములూరు కేంద్రంగా కడప రైతులు విత్తనం పసుపును విక్రయిస్తుంటారు. మూడున్నర దశాబ్దాలుగా ఈ విధంగా విక్రయిస్తున్నారు. ప్రస్తుత సీజనుకు సంబంధించి వారం రోజుల క్రితం 270 లారీల సరుకు తీసుకొచ్చారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలతోపాటు ఒడిశా నుంచి కూడా రైతులు ఇక్కడికి వచ్చి కొనుగోలు చేస్తున్నారు. నాణ్యమైన విత్తనం, తగిన కాటా నమ్మకంతో విత్తనాలకు గిరాకీ ఏర్పడింది. విత్తన పసుపు వ్యాపారానికి సంబంధించి ఏటా కాటాపాట జరుగుతుంది. దీనిపై వచ్చే ఆదాయం గ్రామ పంచాయతీకి లభిస్తుంది. 250 మందికి కొన్నిరోజులు ఉపాధి కూడా లభిస్తోంది.

పెరిగిన పెట్టుబడి ఖర్చులు

ఒక్కో ఎకరాకు విత్తన పసుపు పుట్టి లెక్కన విత్తుతారు. ఒక్కో పుట్టి 225 కిలోలు ఉంటుంది. ప్రస్తుతం తూములూరు కేంద్రంలో విత్తన పసుపు పుట్టి రూ.5,800 నుంచి రూ.6,000 వరకు పలుకుతోంది. గతేడాదితో పోల్చితే ధర తగ్గింది. గతేడాది పుట్టి రూ.10 వేల వరకు విక్రయించారు. రైతులు ఒక్కో ఎకరాకు ఆరు నుంచి ఎనిమిది పుట్లు విత్తన పసుపు వినియోగిస్తారు. అంటే ప్రస్తుత ధరల ప్రకారం పసుపు విత్తనానికి ఎకరాకు రూ.36 వేల నుంచి రూ.48 వేల వరకు వ్యయం చేయాల్సి వస్తుంది. పసుపు విత్తేందుకు ముందుగా చేలలో ట్రాక్టరుతో సాళ్లు తీసేందుకు రూ.4 వేలు, తర్వాత కూలీలతో పసుపు విత్తటానికి రూ.3 వేల చొప్పున ఖర్చవుతుంది. అంటే కేవలం పసుపు విత్తేవరకు మాత్రమే రూ.50 వేలకు పైగా పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. మొత్తం పంట చేతికొచ్చేసరికి ఎకరాకు రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు పెట్టుబడులు అనివార్యం. పసుపు సాగుకు కౌలుకు తీసుకుంటే మరో రూ.55 వేలు అదనం. దిగుబడి తగ్గినప్పటికీ మార్కెట్ ధర బాగుంటే రైతులు ఒడ్డున పడే అవకాశం ఉంది. కానీ చేతికొచ్చే సరికి ఏ ధర ఉంటుందో తెలీని పరిస్థితి. గిట్టుబాటు ధర సంగతి అటుంచి క్వింటా ధర కనీసం రూ.11 వేలు ఉండాలని రైతులు తమ ఆకాంక్ష వెల్లడించారు.





అమ్మవారికి సారె సమర్పించేందుకు విచ్చేసిన భక్త బృందాలు

దుర్గమ్మకు ఆషాఢ సారె

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ):ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఆషాఢ మాసోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. దేవస్థానం తరఫున ఆలయ ఈఓ శీనానాయక్ దంపతులు దుర్గమ్మకు తొలి సారె సమర్పించారు. తొలుత ప్రధాన ఆలయంలోని మూలవిరాట్‌కు, ఉత్సవ మూర్తికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రధాన ఆలయం నుంచి ఉత్సవ మూర్తిని మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ మహా మండపం ఆరో అంతస్తుకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఆరో అంతస్తులో వేదికపై దుర్గమ్మ ఉత్సవ మూర్తిని ప్రతిష్ఠించిన ఆలయ అర్చకులు పూజలు జరిపించారు. అనంతరం దేవస్థానం తరఫున ఆలయ ఈఓ శీనానాయక్ దంపతులు అమ్మవారికి పట్టుచీర, పసుపు, కుంకుమ, పూజా సామగ్రి, మిఠాయిలు సమర్పించారు. తరలివచ్చిన భక్త బృందాలు, భక్తుల కుటుంబ సభ్యులతో ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకుంది. అనంతరం భక్తులు తమ బంధువులు, స్నేహితులకు తాంబూలాలు ఇచ్చి పుచ్చుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు లింగంభొట్ల దుర్గాప్రసాద్, వైదిక కమిటీ సభ్యుడు కోట ప్రసాద్ పూజా కార్యక్రమాలను నిర్వహించగా, ఆలయ ఏసీ సీహెచ్.రంగారావు, ఏఈఓలు ఎన్.రమేష్‌బాబు, వెంకటరెడ్డి, తిరుమలరావు, జంగం శ్రీనివాస్, కె.గంగాధర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. హోం శాఖ మంత్రి వి.అనిత కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి గురువారం ఉదయంఆషాఢ సారె సమర్పించారు.

అవుట్ సోర్సింగ్ కార్మికుల నిరసన



నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులు

- పలు సమస్యల పరిష్కారానికి డిమాండ్
- కూటమి ప్రభుత్వ తీరుపై మండిపాటు
- నేడు సీడీఎంఏ కార్యాలయం ముట్టడి

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): నగరపాలక సంస్థ కార్యాలయాల్లోని ఇంజినీరింగ్ విభాగంలో అవుట్ సోర్సింగ్ కార్మికులకు జీతాలు పెంచాలని నాలుగు రోజులుగా నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని రాష్ట్ర మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికల సంఘాల జేఏసీ చైర్మన్ మధుబాబు తెలిపారు. శుక్రవారం కార్మిక సంఘాలతో కలిసి సీడీఎంఏ (కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్) కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు పేర్కొన్నారు. గురువారం నగరపాలక సంస్థ కార్యాలయం వద కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఇంత వరకు కార్మికులకు ఎటువంటి న్యాయం చేయలేదన్నారు. మేనిఫెస్టోలో పెట్టిన విధంగా తమకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ఉన్నతాధికారులకు తెలిపినా ఫలితం లేదని వాపోయారు. కార్మికుల పట్ల ప్రభుత్వం, ఉన్నతాధికారులు వ్యవహరిస్తున్న తీరుకు వ్యతిరేకంగా శుక్రవారం సీడీఎంఏ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు తెలిపారు.

ఇవేం కష్టాలు బాబోయ్!

సీఎం రాకతో అమరావతి రోడ్డులో అడుగడుగునా ట్రాఫిక్ ఆంక్షలు

- ఎక్కడికక్కడ గంటల తరబడి వాహనదారుల నిలిపివేత
- ఆమడ దూరంలోని ఇళ్లకు వెళ్లేందుకూ ప్రజలకు ఇక్కట్లు
- వర్షంలో తడిసి ముద్దయిన విద్యార్థులు, మహిళలు



సీఎం పర్యటన ఆంక్షలకు తోడు వాన కురవడంతో మహిళల అవస్థలు

నగరంపాలెం, నెహ్రూనగర్: గుంటూరు నగరంలో గురువారం;సీఎం చంద్రబాబు పర్యటన, అవగాహన ర్యాలీ దెబ్బకు ‘ఇవేం కష్టాలు బాబోయ్’ అని ప్రజలు, వాహన చోదకులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. అంతర్జాతీయ మాదక ద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం పేరుతో కార్యక్రమం జరిగింది. దీంతో సాయంత్రం వేళ విద్యాసంస్థలు, కార్యాలయాల నుంచి నివాసాలకు వెళ్లేందుకు ప్రజలు అష్టకష్టాలు పడ్డారు. ఫీవర్ ఆసుపత్రి నుంచి చిల్లీస్ వరకు వాకథాన్ ర్యాలీ చేపట్టారు. ఈ క్రమంలో అమరావతి రోడ్డు నుంచి ఫీవర్ ఆసుపత్రి, వయా చిల్లీస్ వరకు రెండు వైపులా రహదారిని పోలీసులు అధీనంలోకి తీసుకున్నారు. అడుగడుగునా ట్రాఫిక్ ఆంక్షలు విధించి ప్రజలను ముప్పుతిప్పలకు గురిచేశారు.

ఎటు తిరిగి వెళ్లినా బారికేడ్లే

అమరావతి రోడ్డుకు మొదట ఉన్న ట్రాఫిక్ సిగ్నల్ల వద్ద బారికేడ్లను ఏర్పాటు చేశారు. దీంతో చోదకులు, పాదచారులు నాయుడుపేట, శ్రీనగర్ వైపు చుట్టూ తిరిగి వెళ్లారు. అక్కడ నుంచి మళ్లీ అమరావతి రోడ్డు మీదుగా వెళ్తే కొద్దిదూరం బారికేడ్లను అడ్డుపెట్టారు. దీంతో మళ్లీ ఇబ్బందులు తప్పలేదు. కనీసం అక్కడి నుంచి దగ్గరలో ఉన్న నివాసాలలో ఉండే వారిని కూడా వాహనాలు సహా ఆపేశారు. దీంతో పాఠశాలల నుంచి ఇళ్లకు వెళ్తున్న చోదకులకు ఇబ్బందులు తప్పలేదు. అదే బారికేడ్లకు సమీపాన ఉన్న పెట్రోల్ బంక్‌లో ఆయిల్ కొట్టించుకుంటామని ప్రాధేయపడినా పోలీసులు తొలగించలేదు. ఇద్దరు సీఐలు మాత్రం మరింత అత్యుత్సాహం చూపారు. ద్విచక్ర వాహనం ముందుకు వెళ్తే రూ.5 వేలు జరిమానా విధిస్తామని ఓ సీఐ మొబైల్ ఫోన్ చేత్తో పట్టుకుని హల్‌చల్ చేశారు. పిల్లలను తీసుకొని వచ్చిన ఓ మహిళైతే ఇల్లు దగ్గరే అని చెప్పినా, అర్ధగంట తర్వాత మాత్రమే పంపిస్తానని పోలీసులు చెప్పారు. అప్పటి వరకు వేచి ఉండాల్సిందేనని పోలీసులు చెప్పడంతో ఆమె మిన్నకుండిపోయారు.



పిల్లలతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మహిళకు ఆంక్షలతో తప్పని కష్టాలు

నేడు ఏఐ 4 ఆంధ్రా పోలీస్ హ్యాకథాన్ ప్రారంభం

సీఎం చంద్రబాబు రాక

ప్రత్తిపాడు: ఏఐ ఉపయోగించి వినూత్న పోలీసింగ్, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏపీ పోలీస్ శాఖ ‘ఏఐ 4 ఆంధ్రా పోలీస్ హ్యాకథాన్’ను ప్రారంభించనుంది. గుంటూరు రూరల్ మండలం చౌడవరంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు దీన్ని ప్రారంభించనున్నారు. ఈ నెల 27, 28, 29వ తేదీల్లో జరగనున్న హ్యాకథాన్‌లో తమ నైపుణ్యాలను ప్రదర్శించేందుకు ఇప్పటికే 60కుపైగా బృందాలు దేశ విదేశాల నుంచి పలు విద్యాసంస్థలు, స్టార్టప్‌లు, ఐటీ కంపెనీలు పేర్లు నమోదు చేసుకున్నాయి. ఉత్తమ ప్రతిభ చాటిన బృందానికి రూ. 10 లక్షల నగదు బహుమతి, ఏపీ పోలీసు శాఖ నుంచి సర్టిఫికెట్లు అందించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా ఉన్నతాధికారులు పూర్తి చేశారు.

స్థానికులనూ బయటకు రానివ్వలేదు...



ద్వారకానగర్ ఐదో వీధిలోని ప్రజలు బయటకు రాకుండా కాపలా కాస్తున్న ఓ కానిస్టేబుల్

ద్వారకానగర్, ముత్యాలరెడ్డినగర్ తదితర ప్రాంతాల వైపు వెళ్లే చోదకులు, పాదచారులు అమరావతి రోడ్డుపైకి రాకుండా నిలిపివేశారు. ఆయా రహదారుల వద్ద ఒక్కొక్క కానిస్టేబుల్‌ను నియమించి, రాకపోకలను నియంత్రించారు. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ర్యాలీ ముగిశాక వర్షం పడటంతో విద్యార్థులు పరుగులు తీశారు. దగ్గర్లోని దుకాణాల వద్ద వేచి ఉండాల్సి వచ్చింది. విద్యార్థులను తరలించిన ప్రైవేట్ బస్‌లు దూరంగా నిలిపివేయడంతో వర్షంలోనే ముద్దగా తడుస్తూ ముందుకెళ్లారు. కొందరైతే ఫ్లెక్సీలు, ప్లకార్డులు తలపై పెట్టుకుని బయలుదేరారు. మహిళలు తమ పిల్లలను పాఠశాలల నుంచి తీసుకెళ్లడానికి నానా అవస్థలు పడ్డారు. సీఎం స్థాయి వ్యక్తి కార్యక్రమాన్ని విద్యాసంస్థలు, కార్యాలయాలు ముగిసే సమయానికి రోడ్డుపై ఏర్పాటు చేసిన తీరుపై నగరవాసులు మండిపడ్డారు. తీరుతెన్ను లేకుండా ఏర్పాట్లు ఉండటం, వర్షం కూడా కురవడంతో గంటల తరబడి రోడ్డుపైనే నానా ఇబ్బందులు పడ్డామని వాపోయారు.

ముంచెత్తే మత్తు.. బతుకే చిత్తు

కూటమి పాలనలో విచ్చలవిడిగా డ్రగ్స్ విక్రయాలు

కూటమి అధికారంలోకి వచ్చాక డ్రగ్స్ దందా జిల్లాలో జోరుగా సాగుతోంది. యువత, కళాశాలల విద్యార్థులు, పాఠశాలల్లో చదువుకునే బాలలే లక్ష్యంగా మాదకద్రవ్యాల ముఠాలు చెలరేగిపోతున్నాయి. పాలకులకు రెడ్‌బుక్ పేరిట రాజకీయ కక్షలు సాధించడంతో సరిపోతోంది. దీంతో డ్రగ్స్ దెబ్బకు యువత బంగారు భవిష్యత్తు నాశనం అవుతోంది. మరోవైపు ప్రజలకు రక్షణ కొరవడుతోంది.


- కళాశాలల యువతే లక్ష్యంగా అమ్మకాలు
- శివారు ప్రాంతాలలో జోరుగా సాగుతున్న దందా
- ఏడాదిలోనే 300 కేజీల గంజాయి స్వాధీనం
- కట్టడిలో పూర్తిగా విఫలమైన కూటమి సర్కార్



నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్) : రాజధాని ప్రాంతమైన గుంటూరు జిల్లాలో గంజాయి, కొకైన్, మెత్, ఎండీఎం వంటి మాదకద్రవ్యాల విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. విశాఖపట్నం, పాడేరు, అరకు, శ్రీకాకుళం తదితర ప్రాంతాల నుంచి జిల్లాకు గంజాయి భారీగా సరఫరా అవుతోంది. ముఖ్యంగా కళాశాలలు, పాఠశాలల వద్ద విద్యార్థులు, యువతే లక్ష్యంగా విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.

విద్యార్థులే లక్ష్యంగా...

శివారు ప్రాంతాలలో విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. అక్కడి నుంచి నగరంలోకి సిగరెట్స్, చాకెట్లు, చూయింగ్ గమ్, పౌడర్ రూపంలో తీసుకొస్తున్నారు. కళాశాలలు, పాఠశాలల వద్ద విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని జోరుగా విక్రయాలు జరుపుతున్నారు. కేజీ గంజాయి రూ.6 వేల నుంచి రూ.10 వేల వరకు విక్రయిస్తున్నారు. అదే విధంగా గ్రాము చొప్పున క్రిస్టల్‌ను రూ.8 వేలు నుంచి రూ.10 వేలు, మెత్‌ను రూ.5 వేలు నుంచి రూ.6 వేలు, ఎండీఎంఏను రూ.3 వేలు నుంచి రూ. 5 వేల వరకు విక్రయిస్తున్నారు. ఢిల్లీ, ముంబై, బెంగళూరు ప్రాంతాల నుంచి గుంటూరు జిల్లాకు మాదకద్రవ్యాలు చేరుతున్నాయి.



రాజధాని ప్రాంతంలోనే ఎక్కువ



మంగళగిరి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఒక్క ఈ స్టేషన్ పరిధిలోనే గత సంవత్సరం ఆగస్టులో 231.2 కేజీల గంజాయి స్వాధీనం చేసుకోవడంతోపాటు ఏడుగురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. జిల్లా వ్యాప్తంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 234.2 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. 38 మందిని అరెస్ట్ చేశారు. దీంతోపాటు మెత్, ఎండీఎంఏ 23 గ్రాములు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై మూడు కేసులు నమోదు చేయడంతో పాటు 17 మందిని అరెస్ట్ చేశారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో సుమారు వంద కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి 20 మందిని అరెస్టు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. మరో వైపు అధిక ధర పెట్టి మద్యం కొనుగోలు చేయలేక చాలా మంది పేదలు, రోజువారీ కూలీలు తక్కువ ధరకు లభించే శానిటైజర్‌ను మెడికల్ షాపుల్లో కొనుగోలు చేసి మత్తులో తేలుతున్నారు. ఆయా షాపుల్లో ఇలాంటివి విక్రయించడంపై నిబంధనలు కఠినతరం చేయాల్సిన అవసరం ఉంది.

క్లుప్తంగా

11 మండలాల్లో తేలికపాటి వర్షం

కొరిటెపాడు (గుంటూరు): గుంటూరు జిల్లాలోని 11 మండలాల్లో తేలికపాటి వర్షం పడింది. బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు అత్యధికంగా తుళ్ళూరు మండలంలో 6.4 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా వట్టిచెరుకూరు మండలంలో 0.2 మి.మీ. పడింది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ... తాడికొండ మండలంలో 4.2, తాడేపల్లి 3.4, మంగళగిరి 3, కొల్లిపర 2.6, మేడికొండూరు 2.4, గుంటూరు తూర్పు 2.2, గుంటూరు పశ్చిమ 2.2, చేబ్రోలు 1.2, ఫిరంగిపురం మండలంలో మి.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది.

సీపెట్‌లో ప్రవేశాలకు ఆహ్వానం

గుంటూరు ఎడ్యుకేషన్: విజయవాడలోని కేంద్ర పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సీపెట్)లో టెన్త్ సప్లిమెంటరీలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు ప్రత్యేక అవకాశం కల్పిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ శేఖర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల వ్యవధి గల డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ (డీపీటీ), డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ (డీపీఎంటీ) కోర్సుల్లో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు జూలై 10వ తేదీలోపు దరఖాస్తు చేయాలని సూచించారు. కళాశాల ప్రాంగణంలో విద్యార్థినులు, విద్యార్థులకు వేర్వేరుగా హాస్టల్ వసతి ఉందన్నారు. నిబంధనలను అనుసరించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయం కలదని తెలిపారు. దరఖాస్తుతో పాటు ఇతర వివరాలకు 78935 86494 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా మీరా



గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా యూనియన్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఎస్. నాగుల్ మీరా ఎన్నికయ్యారు. యూనియన్ రాష్ట్ర మహాసభలు ఒంగోలులో ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు జరిగాయి. ఈ సభల్లో నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో పలు పదవులు నిర్వర్తించి, నూతన రాష్ట్ర కార్యవర్గంలో కూడా ఎస్.ఎన్. మీరా ఎన్నికవడంతో జిల్లా కార్యదర్శి రాంబాబు, గుంటూరు నగర అధ్యక్షుడు వి.కిరణ్‌కుమార్, కార్యదర్శి కె.ఫణీంద్ర తదితరులు మీరాకు అభినందనలు తెలిపారు.

చిన్నారులు పోటీతత్వాన్ని పెంచుకోవాలి

గుంటూరు వెస్ట్ (క్రీడలు): చిన్నారులు క్రీడా సాధన ద్వారా పోటీతత్వాన్ని అలవరచుకోవాలని ఏసీఎంఈ స్కూల్ డైరెక్టర్ నందమూరి సౌగంధ కృష్ణ తెలిపారు. గుంటూరు ఫెన్సింగ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం గుంటూరు రూరల్ మండలం పొత్తూరులోని ఏసీఎంఈ స్కూల్ ప్రాంగణంలో జరిగిన అండర్–10, 12 బాలబాలికల జిల్లా స్థాయి ఫెన్సింగ్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధునిక ప్రపంచంలో శారీరక పటుత్వానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రతి విద్యార్థి తనకు నచ్చిన క్రీడలో సాధన చేయాలని తెలిపారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డి.అశోక్ బాబు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 50 మంది చిన్నారులు పోటీల్లో పాల్గొన్నారన్నారు. ఎంపికైన వారిని ఈ నెల 29వ తేదీన విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు. అనంతరం విద్యార్థులకు సౌగంధ కృష్ణ, అశోక్ బాబు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ చైర్మన్ డీఎస్ క్రిష్టోఫర్, పీఈటీ రాజేష్ ఇజ్రాయేల్ తదితరులు పాల్గొన్నారు.



ఫెన్సింగ్ పోటీలను ప్రారంభిస్తున్న సౌగంధ కృష్ణ

విజేతలు వీరే...

- అండర్ 12 బాలుర విభాగంలో..
  సాబర్ విభాగం: చైతన్య కృష్ణ, పృథ్వీ వినయ్,
  ఫాయిల్ విభాగం: ఇ.కౌశిక్.
  బాలికల విభాగంలో....
  సాబర్ విభాగం: ఆరోహి, హన్సిక
  ఎప్పి విభాగం: జోష్నిక, లక్ష్మీ కార్తిక,
  ఫాయిల్ విభాగం: శ్లోక, హస్నా.
- అండర్–10 బాలుర విభాగంలో...
  ఫాయిల్ విభాగం: రిశాంక్, సంజయ్
  ఎప్పి విభాగం: హర్షవర్ధన్.
  బాలికలలో.. ఎప్పి విభాగం: దీక్షిత, తన్మయి శ్రీ.

వైద్యులకు క్రీడలతో ఉపశమనం

గుంటూరు వెస్ట్ (క్రీడలు): వృత్తిపరంగా పెరుగుతున్న ఒత్తిడిని అధిగమించేందుకు వైద్యులు నిత్యం క్రీడా సాధన చేయాలని డాక్టర్స్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్ (డీఎస్‌సీవో) కార్యదర్శి డాక్టర్ ఆవుల శ్రీనివాసరావు తెలిపారు. గురువారం స్థానిక గుంటూరు మెడికల్ అసోసియేషన్ భవన సముదాయంలో నిర్వహించిన క్యారమ్స్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పని ఒత్తిడిని అధిగమించడంతోపాటు ఆటవిడుపు కోసం ప్రతి ఏడాది వైద్యుల కోసం కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 29వ తేదీ వరకు భాగంగా క్యారమ్స్‌తోపాటు క్రికెట్, చెస్, కల్చరల్ విభాగాల్లో పోటీలు కొనసాగుతాయని చెప్పారు. సుమారు 50 మంది పేరొందిన వైద్యులు పాల్గొంటారని తెలిపారు. ప్రారంభ కార్యక్రమంలో డీఎస్‌సీవో అధ్యక్షుడు డాక్టర్ టి.సి. రెడ్డి తదితరులు పాల్గొన్నారు. క్యారమ్స్ పోటీలకు ఏపీ క్యారమ్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ జలీల్ రిఫరీగా వ్యవహరించారు.



క్యారమ్స్ పోటీల్లో తలపడుతున్న వైద్యులు

'దారి తప్పుతున్న కూటమి ఏడాది పాలన' పుస్తకావిష్కరణ

సత్తెనపల్లి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని పుతుంబాక భవన్‌లో సీపీఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ప్రచురించిన 'దారి తప్పుతున్న టీడీపీ కూటమి ఏడాది పాలన' అనే పుస్తకాన్ని గురువారం ఆయన ఆవిష్కరించారు.

- విజయ్‌కుమార్ మాట్లాడుతూ మహిళలకు ఉచిత గ్యాస్ నగదు పడక ఇప్పటికీ బ్యాంకుల చుట్టూ, అధికారుల చుట్టూ తిరుగుతున్నారన్నారు.
- తల్లికి వందనం మొదటి సంవత్సరం డబ్బులు వేయకుండా రెండవ సంవత్సరం వేశారని, అయినా కరెంటు బిల్లులు, కార్లు అని అనేక మందికి నగదు వేయలేదన్నారు.
- అంగన్‌వాడీలు, స్కీం వర్కర్లకు ప్రభుత్వ ఉద్యోగులనే పేరుతో వారికి కూడా నగదు వేయకపోవడం దారుణమన్నారు.
- గత ప్రభుత్వంలో స్మార్ట్‌మీటర్లు పెడితే పగలగొట్టమని నారా లోకేష్ పిలుపునిచ్చారని, కానీ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇళ్లకు కూడా స్మార్ట్ మీటర్లు బిగించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన విమర్శించారు.
- కూటమి ప్రభుత్వం వచ్చి మోడల్ స్కూల్ పేరుతో 3,4,5 తరగతులను విడదీసి దూరంగా ఉన్న హైస్కూళ్లకు విలీనం చేయడంతో ఉన్న స్కూల్లో పిల్లల సంఖ్య తగ్గిపోయిందని, ఆ స్కూల్‌ను కూడా మూసివేసే పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. కార్యక్రమంలో సీపీఎం మాజీ రాష్ట్ర కమిటీ సభ్యుడు గద్దె చలమయ్య, పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అనుముల లక్ష్మీశ్వర్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు ధరణికోట విమల, పెండ్యాల మహేష్, గుంటూరు మల్లేశ్వరి, గుంటుపల్లి బాలకృష్ణ, నాయకులు ఎం.హరిపోతురాజు, గుంటుపల్లి రజని, స్పందన, జడ రాజకుమార్, షేక్ మస్తాన్ వలి, తదితరులు పాల్గొన్నారు.



పుస్తకం ఆవిష్కరిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్, నాయకులు

డ్రైవర్ల శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

నరసరావుపేట: స్థానిక ఏపీఎస్ఆర్టీసీ డిపో ఆవరణలోని డ్రైవర్ల శిక్షణ స్కూల్లో 20వ బ్యాచ్ శిక్షణకు ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని డిపో మేనేజర్ బి.శ్రీనివాసరావు గురువారం కోరారు. ఇప్పటివరకు 19 బ్యాచ్‌ల శిక్షణ విజయవంతంగా పూర్తయిందన్నారు. వచ్చేవారంలో 20వ బ్యాచ్ ప్రారంభం కానుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ శిక్షణ కార్యక్రమంలో చేరి నైపుణ్యం పొందవచ్చని తెలిపారు. అభ్యర్థులు తప్పనిసరిగా ఒక ఏడాది క్రితమే లైట్ వెయిట్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. శిక్షణ ఫీజు రూ.23వేలుగా నిర్ణయించామని, ఆసక్తిగల అభ్యర్థులు 99592 25428 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

'మత్తు రహిత' సమాజ స్థాపన కీలకం

ఆర్డీవో రామలక్ష్మి

రేపల్లె: మత్తు పదార్థాల రహిత సమాజ స్థాపనలో ప్రతి ఒక్కరూ నడుంబిగించాలని ఆర్డీవో నేలపు రామలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీసు శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆమె ప్రారంభించి మాట్లాడారు. మాదక ద్రవ్యాలను సమూలంగా నిర్మూలించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. మాదక ద్రవ్యాలతో కుటుంబాలు నాశనమవ్వటంతోపాటు సమాజం పెడద్రోవ పడుతోందన్నారు. మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ముఖ్యంగా పాఠశాల, కళాశాల విద్యార్థులు మాదక ద్రవ్యాలపై అవగాహన ఉండి వీటికి దూరంగా ఉండాలన్నారు. సమాజంలో తోటి వారికి వీటిపై అవగాహన కల్పించాలని కోరారు. ఏబీఆర్ డిగ్రీ కళాశాల నుంచి రింగు రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు, సీఐలు సురేష్‌బాబు, మల్లికార్జునరావు, తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రసాద్, టీడీపీ నాయకులు అనగాని శివప్రసాద్, వివిధ కళాశాలల, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



రేపల్లెలో ర్యాలీలో పాల్గొన్న ఆర్డీవో రామలక్ష్మి, డీఎస్పీ శ్రీనివాసరావు, విద్యార్థులు

ఫెన్సింగ్‌లో సిల్వర్ మెడల్

సంతమాగులూరు (అద్దంకి రూరల్): వెల్లలచెరువు గ్రామానికి చెందిన జి.తన్మయ్‌శ్రీ ఏసీఎంఈ ఇంటర్నేషనల్ స్కూల్‌లో గురువారం జరిగిన గుంటూరు డిస్ట్రిక్ట్ ఫెన్సింగ్‌లో అండర్ 10 కేటగిరీలో ఫాయిల్ ఈవెంట్‌లో సిల్వర్ మెడల్ సాధించింది. ఈ నెల 29న విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లో పాల్గొననున్నట్లు కోచ్ తెలిపారు. తన్మయ్‌ని గుంటూరు జిల్లా సెక్రటరీ అశోక్‌బాబు, ఏపీఎంఈ స్కూల్ డైరెక్టర్ ఎన్. సౌగంథ్ కృష్ణ అభినందించారు.



డివైడర్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

అద్దంకి: ఆర్టీసీ బస్సు అదుపు తప్పి డివైడర్ గ్రిల్స్‌ను ఢీకొట్టిన ఘటన పట్టణంలోని రంగారావు వైద్యశాల సమీపంలో గురువారం జరిగింది. నెల్లూరు నుంచి హైదరాబాదుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు తెల్లవారుజామున రెండు గంటల సమయంలో రంగారావు వైద్యశాలకు ఎదురుగా ఉన్న డివైడర్ ఇనుప గ్రిల్స్‌ను ఢీ కొట్టింది. డ్రైవర్ అప్రమత్తం కావడంతో ప్రయాణికులకు ఏమీ కాలేదు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అయితే డ్రైవర్ నిద్రమత్తు కారణంగానే బస్సు అదుపు తప్పి ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. ఈ మధ్య ఇలాంటి సంఘటనలు ఎక్కువగా జరుగుతుండడంతో ప్రజలు భయపడుతున్నారు. పట్టణం నుంచి నామ్ రహదారి వెళ్తుండటంతో రహదారి రద్దీగా మారిందని, బైపాస్ నిర్మిస్తే ట్రాఫిక్ సమస్య తీరే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు.

మోదీ పాలనలో అప్రకటిత ఎమర్జెన్సీ

మార్టూరు: దేశంలో ఐదు దశాబ్దాల క్రిందటి ఎమర్జెన్సీలో ప్రజలు, ఉద్యోగులు విద్యార్థులు, మేధావులు తదితర అన్ని రంగాలకు చెందిన వారు సంక్షోభాన్ని ఎదుర్కొంటే నేడు మోదీ పాలనలో అంతకంటే ఘోరమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నామని జిల్లా కౌలు రైతు సంఘం కార్యదర్శి సీహెచ్ గంగయ్య అన్నారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల కార్యాలయంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో గంగయ్య మాట్లాడారు. 1975 జూన్ 25వ తేదీన అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించి మేధావులు, ఉద్యోగులు, ప్రజల హక్కులు కాలరాశారన్నారు. కానీ ప్రస్తుతం మోదీ ప్రభుత్వంలో అప్రకటిత ఎమర్జెన్సీ విధించి.. అన్ని రంగాలను నాశనం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎన్నికల సంఘం, సీబీఐ, ఈడీ, తదితర రాజ్యాంగ వ్యవస్థలను నిష్పక్షపాతంగా వ్యవహరించకుండా తన గుప్పెట్లో పెట్టుకున్నారని తెలిపారు. దీనివలన రైతులు, కార్మికులు, ప్రజల హక్కులకు భంగం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉండగా సంస్కరణల బాట పట్టించాల్సింది పోయి వ్యవసాయాన్ని కార్పొరేట్ సంస్థలకు పాదాక్రాంతం చేసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. మతం ప్రాతిపదికగా కేంద్ర ప్రభుత్వం అలంబిస్తున్న విధానాలను పార్టీలు, ప్రజా సంఘాలు, ప్రజలు ఏకతాటిపై నిలిచి ఎదురుకోవాలని లేకుంటే గత ఎమర్జెన్సీ పాలన మించిన గడ్డు పరిస్థితులను ప్రజలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు బత్తుల హనుమంతరావు, విశ్రాంత ఉద్యోగులు ఇతర ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య

వివాహితతో అసభ్య ప్రవర్తన

- పురుగుమందు తాగి వివాహిత ఆత్మహత్యాయత్నం
- ముగ్గురుపై కేసు నమోదు

అమరావతి: మండల పరిధిలోని అత్తలూరులో యువతితో అసభ్యంగా ప్రవర్తించిన కేసులో ముగ్గురిపై అమరావతి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. బుధవారం అత్తలూరు బీసీ కాలనీకి చెందిన వివాహితతో అదే కాలనీకి చెందిన టి.యోగేంద్ర, బి.అంకమ్మరాజు, బి.పోతురాజులు అసభ్యంగా ప్రవర్తించారు. ఆ సమయంలో ఆమె భర్త రావటంతో ముగ్గురు అక్కడి నుంచి పారిపోయారు. దీనిపై తీవ్ర మనస్తాపం చెందిన వివాహిత పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేయగా కుటుంబసభ్యులు గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. అసభ్యంగా ప్రవర్తించిన ముగ్గురు యువకులపై కేసు నమోదు చేసి గురువారం అదుపులోకి తీసుకున్నామని సీఐ అచ్చియ్య తెలిపారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. 1,400 గరిష్టం : రూ. 2,100

మోడల్ ధర రూ. 1,700



పసుపు ధరలు (గురువారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 596

కొమ్ములు : 361 బస్తాలు (ధర రూ॥ల్లో)		
కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,650	11,000	10,450

కాయలు : 235 బస్తాలు		
కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,650	10,500	10,400

మొత్తం అమ్మకాలు : 447 క్వింటాళ్లు

–దుగ్గిరాల

మిర్చి యార్డు సమాచారం (గురువారం ధరలు)

వచ్చిన బస్తాలు	44,633
అమ్మకాలు	43,848
నిల్వ	10,563



నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	రూ. 9,500 – 13,000
నంబరు–5	రూ. 10,000 – 13,300
341	రూ. 10,000 – 13,200

నాన్ ఏసీ ప్రత్యేక రకం క్వింటా (రూ.)

తేజ	రూ. 10,000 – 13,500
బాడిగ – 355	రూ. 10,000 – 13,000
దేవనూరు డీలక్స్	రూ. 10,000 – 12,800
ఆర్మూర్	రూ. 9,800 – 11,000
తాలుకాయలు	రూ. 5,000 – 6,800

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	రూ. 9,500 – 13,000
నంబరు–5	రూ. 10,000 – 13,400
341	రూ. 10,000 – 13,500

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	రూ. 10,000 – 13,600
బాడిగ – 355	రూ. 10,000 – 13,000
తాలుకాయలు	రూ. 5,500 – 7,000

–కొరిటెపాడు (గుంటూరు)

నేటి నుంచి ఇస్కాన్ రథయాత్ర



ఆటోనగర్(విజయవాడతూర్పు): దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద రథయాత్రగా పేరుగాంచిన ఇస్కాన్ విజయవాడ వారి జగన్నాథ స్వామి రథయాత్ర ఈనెల 27 నుంచి మూడు రోజుల పాటు జరుగుతుందని స్థానిక ఇస్కాన్ మందిర అధ్యక్షుడు చక్రధారిదాస్ తెలిపారు. గురువారం 16వ డివిజన్‌లోని పాత వీబీఎం కాలేజీలోని ఇస్కాన్ మందిరంలో ఆయన విలేకరుల సమావేశంలో రథయాత్రకు సంబంధించిన పోస్టర్లతో పాటు టీషర్ట్‌లు, టోపీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చక్రధారిదాస్ మాట్లాడుతూ శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంటకు రథయాత్రను సీఎం చంద్రబాబు ప్రారంభించనున్నట్టు చెప్పారు. జూన్ 27 నుంచి 29 వరకు ప్రతి రోజు సాయంత్రం 5 గంటల నుంచి 3.5 ఎకరాల విస్తీర్ణంలో రథయాత్ర మేళా మహోత్సవం జరగనున్నట్టు చెప్పారు. ఈ ఏడాది ప్రత్యేకంగా జూన్ 29న సుమంగళి సుభద్ర అనే ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. విజయవాడ, గుంటూరు జిల్లాల నుంచి ప్రముఖ పారిశ్రామికవేత్తలు 1000 మందికి పైగా మహిళలు సుభద్ర అమ్మవారికి 4 ఎద్దుల బండ్లలో ఊరేగింపుగా వచ్చి సారె సమర్పించనున్నట్లు చెప్పారు. భవానీపురంలోని సితారా గ్రౌండ్స్, స్వాతి థియేటర్, కనకదుర్గ అమ్మవారి గుడిరోడ్డు మీదుగా రథం సెంటరు సీతమ్మవారి పాదాలు వరకు రథయాత్ర సాగుతుందన్నారు.

వారాహి ఉత్సవాలకు శ్రీకారం

నాగాయలంక: స్థానిక కృష్ణానదీ తీరంలోని శ్రీరామ పాదక్షేత్రం సముదాయంలోని శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో గురువారం శ్రీవారాహి అమ్మవారి ద్వితీయ ఆషాఢ గుప్త నవరాత్రి మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలుత కనకదుర్గమ్మకు విశేష పూజ, ప్రత్యేక అలంకారం చేశారు. తెల్లవారుజామున వారాహి అమ్మవారి విగ్రహానికి శాస్త్రోక్త పూజలు చేసి కనకదుర్గమ్మ ఎదుట ముఖమండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పీఠంపై ప్రతిష్ఠించారు. వారాహి మాతను పసుపు, కుంకుమ, సుగంధ ద్రవ్యాలతో అభిషేకించి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు.